# తిరగబడిన సిద్ధాంతం

**కె.వి.వి. సత్యనారాయణరాజు**

రామారావు ఇంటికి వస్తూనే అంతెత్తున లేచాడు. "నీకసలు బుద్ధుందా? ఈ చొక్కా చూడు!" అంటూ చేయి పైకెత్తి చూపించాడు. చొక్కా చంకలో చిరిగి ఉండడం చూసి అంది అరుణ – "నేను పొద్దుట మీకిచ్చే ముందు చూసే ఇచ్చానండీ!"

"అంటే నాకు చొక్కా తొడుక్కోవడం కూడా సరిగ్గా రాదంటావా? ప్రొద్దుట శుభ్రంగా, రాయిలా ఉన్న చొక్కా, నేను దున్నపోతులా దొర్లడం వల్లే సాయంత్రానికి చిరిగిపోయిందంటావా?" భార్య వైపు చూస్తూ అన్నాడు రామారావు.

"నా ఉద్దేశ్యం అది కాదండీ! నేను సరిగ్గానే చూశాను. ఏ ధ్యాసలో ఉన్నానో కాస్తంత చిరుగు ఉండి ఉంటే అది నా కళ్ళబడలేదు."

"ఆ మాట ముందు రాదేం? నేను రెట్టించి అడిగేసరికి గుర్తొచ్చిందనుకుంటాను. ఏ నాడు సరిగ్గా మాట్లాడేవు కనుక – ఈ రోజు అడగ్గానే ఒప్పుకుంటావని నేననుకోవడానికి!" ధుమధుమలాడుతూ వంటి మీద నుంచి చొక్కా తీసి విసిరేసి లోపలకు వెళ్ళిపోయాడు విసురుగా.

భర్త విసిరేసిన చొక్కా తీసుకొని సూది, దారం తెచ్చుకొని చిరిగిన చోట కుట్టడం ప్రారంభించింది అరుణ.

మొహం కడుక్కొని, బట్టలు మార్చుకొని ఆ గదిలోకి వచ్చిన రామారావు భార్య చేస్తోన్న పని చూసి ఉగ్రుడైపోయాడు.

"పెద్ద పనిగత్తెలా, నా అడుగులకు మడుగులొత్తే దానిలా, నేను చెప్పే ప్రతి పనీ వెంటనే చేసి చచ్చేదానిలా ఇప్పుడే మొదలు పెట్టాలా ఆ పని? మొగుడనే వాడు ఆఫీసునుంచి వచ్చాడనీ, వాడి మొహాన్న ఏమైనా పారేద్దామని ఉందా అసలు నీకు?"

భర్త అభియోగానికి నొచ్చుకొని అంది అరుణ – "అయ్యో అవేం మాటలండీ! మీరొచ్చే ముందే పకోడీలు చేసి, కాఫీ కాచి ఫ్లాస్కులో పోసి ఉంచాను. తెస్తానుండండి." కుడుతున్న చొక్కాను అక్కడే కుర్చీలో వదిలేసి వంటింట్లోకి వెళ్ళింది.

ఓ చేత్తో పకోడీలూ, రెండో చేత్తో నీళ్ళ గ్లాసూ పట్టుకొని ఆ గదిలోకి రాబోయిన అరుణ, భర్త కెవ్వుమనడంతో ఆ వైపు చూసింది.

"ఛీ... ఛీ... ఓ పద్ధతి లేదు. ఎక్కడి వస్తువులక్కడ వదిలెయ్యడమే!" పిర్ర తడుముకొంటూ క్రోధంగా అన్నాడు రామారావు భార్య వైపు చూస్తూ.

అరుణ వంటింట్లోకి వెళ్ళగానే ఆ గదిలో ఉన్న కుర్చీలో చూసుకోకుండా కూర్చున్న రామారావుకు, అరుణ అదే కుర్చీలో చేస్తున్న పని ఆపేసి, వదిలేసిన చొక్కాకున్న సూది గుచ్చుకొంది. అరుణ ఏమీ మాట్లాడకుండా టేబిల్ మీద ఉంచింది పకోడీల పళ్ళెం, మంచినీళ్ళ గ్లాసూ.

"వెధవ సంత...." గొణుక్కుంటూ ప్లేట్లోని పకోడీ తీసి నోట్లో వేసుకున్నాడు. ఆకలి మీద ఉన్నాడేమో సగం ప్లేటు ఖాళీ చేసే వరకూ ఏమీ మాట్లాడలేదు.

సగం తినడం పూర్తయ్యాక, "ఎప్పటివి ఈ పకోడీలు? ఇవ్వాళే చేశావా లేకపోతే నా బాధ పడలేక ఎప్పుడో చేసినవి నా మొహాన్న తగలేశావా?" అన్నాడు రామారావు.

ఆకలి తీరే వరకూ ఏమీ మాట్లాడకుండా తిని, ఆఖరున అతడు చేసిన వ్యాఖ్యానానికి భర్తను ఏమనుకోవాలో అర్థం కాలేదామెకు.

"అవేం మాటలండీ... మీరొచ్చే ముందే చేశాను. మీరు అయిదు గంటలకు వస్తారని తెలిసి కూడా ఎప్పుడో ఎందుకు చేసి ఉంచుతానూ?"

"మరి ఇంత చల్లగా ఉన్నాయేం?" కళ్ళు విప్పించి అన్నాడు రామారావు.

"సరేలెండి, ఇహ నుంచి మీరొచ్చాకే చేస్తాను. ఈ సారిలా జరగనివ్వను."

"ఎప్పుడూ ఉన్న ఏడుపేగా?" మంచినీళ్ళు గటగటా త్రాగి బ్రేవ్‌మని త్రేన్చాడు రామారావు.

* * * *

"ఏవండీ ఈ చీర బాగుందా?"

"ఊఁ"

"మిమ్మల్నే – నా వైపు చూసి చెప్పండి." అంది శాంతి.

తలెత్తి భార్య వైపు చూసి, "ఆఁ" అని మళ్ళీ పేపర్ చదవడంలో మునిగిపోయాడు శ్రీనివాస్.

"హుఁ.... ఇవ్వాళ పండగకదా, నేను నాల్రోజులు ఊళ్ళోని షాపులన్నీ తిరిగి షాపు వాళ్ళచేత నానా మాటలూ పడి సెలెక్ట్ చేసి కొనుక్కొచ్చిన చీర కట్టుకొని ఎలా ఉందని అడిగితే ముక్తసరిగా, ఊ, ఆఁ.... అంటారా? మీ కసలు నేను మీ భార్యననే ఐక్యం ఉందా?"

రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితిని కూలంకషంగా చర్చించి వ్రాసిన ఓ ప్రముఖుడి వ్యాసాన్ని చదువుతున్న శ్రీనివాస్‌కు భార్య మాటలు చెవిలో ఈగ రొదపెడుతున్నట్టుగా, లెక్చరర్ క్లాసులో శ్రద్ధగా విద్యార్థులకు పాఠం అర్థమయ్యేలా చెప్పే సమయంలో, ఓ ప్రబుద్ధుడు లేట్‌గా వచ్చి "మే ఐ కమిన్ సర్?" అని అవసరంలేని అనుమతికోరి అతడి ఎటెన్షన్ పాడుచేసినట్టుగా అనిపించి, చిరాగ్గా భార్య వైపు చూశాడు.

ఆమె ముక్కు పుటాలు అదురుతున్నాయి. విశాలమైన ఆ కళ్ళలో నీళ్ళు సుడులు తిరగడం లీలగా కనిపిస్తోంది. అవమానంతో ఎఱ్ఱబడ్డ ఆమె చెక్కిళ్ళు, భర్త తనను నిర్లక్ష్యం చేశాడన్న ఆమె భావనకు ప్రతిగా ఎగిసెగిసి పడుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసాల తాలూకు అవయవాలూ ఇవన్నీ చూశాక తనకా సమయంలో పేపర్ చదివే యోగం లేదని గ్రహించి, చేతిలోని పేపర్‌ను మడిచి పక్కన పెట్టి కళ్ళజోడు సవరించుకొని, మెప్పుకోలుగా భార్య వైపు చూస్తూ అన్నాడు, "ఏవిటి అడుగుతున్నావ్? చీరకదూ? ఓహ్ సూపర్బ్ చాలా బాగుంది. నువ్వే సెలెక్ట్ చేశావ్ కదూ, చాలా బాగుందోయ్."

భర్త చేస్తోన్న పనిని ఆపించి అతడి దృష్టిని తన వైపు మరల్చుకొన్నందుకు పొంగి పోయింది శాంతి. అయినా ఆ పొంగు పైకి కనబడితే భర్త మళ్ళీ పేపర్‌లో తల దూర్చేస్తాడని ఆమెకు అనుభవపూర్వకంగా తెలుసు కనుక, ఆ పొంగును పైకి కనబడ నివ్వకుండా, "ఇప్పటి కర్థమైందన్న మాట. నేను అరగంట నుంచి మొత్తుకొంటోన్న విషయం?" అంది నిరసనగా.

శ్రీనివాస్ ఏమీ మాట్లాడ లేదు. చాలా మితభాషి అతడు. ఆఫీస్‌లో గానీ, బయటగానీ ఎవరితోనూ అవసరానికి మించి ఒక్కమాట కూడా మాట్లాడడతడు. అతడి కప్పుడప్పుడూ అనిపిస్తోంటుంది – నిత్యమూ ఏదో విషయానికి వసపిట్టలా వాగే భార్యతో తనెంతో కాలం కాపురం చేయలేడేమోనని.

"పాయసం తెమ్మంటారా?" అంది శాంతి.

"ఊఁ" అన్నాడు శ్రీనివాస్.

వంటింట్లోకి వెళ్ళి మరుక్షణంలో తిరిగొచ్చి ఓ గ్లాసతడి చేతి కందిస్తూ – "ఇవ్వాళో కొత్త పద్ధతిలో చేశాను. ఎలా ఉందో చెప్పండి." అంది శాంతి అతడి సరసనే కూర్చుంటూ.

త్రాగడం మొదలు పెట్టిన కొద్ది నిమిషాల్లోనే అతడి మొహం చేదుగా అయింది. అదేమాట పైకి అంటే ఆమె వాగ్ప్రవాహానికి అడ్డుండదని తెలిసిన వాడవడం చేత భార్య మొహంలోకి చూసి ఇబ్బందిగా

నవ్వాడు.

తమ ధోరణి తమదే తప్ప ఎదుటివారి మనసులో ఏముందో ఆలోచించడానికి ప్రయత్నించని చాలా మంది లాంటిదే అయిన శాంతి, భర్త నవ్వును తన పాకశాస్త్ర ప్రావీణ్యానికో మెరిట్ సర్టిఫికెట్‌గా భావించి –

"బాగుంది కదూ? ఇందులో సేమ్యాగానీ, సగ్గుబియ్యంకానీ వేయలేదు. జీడిపప్పు కూడా వేయలేదు. అయినా బాగుందంటే ఇది నిజంగా నా గొప్పే కదూ?" అంది.

భార్య మాటలు విన్న శ్రీనివాస్ ఉలిక్కిపడ్డాడు. సేమ్యావాడక, సగ్గుబియ్యమూ ఉపయోగించకుండా భార్య పాయసం తయారు చేసిందంటే వాటి బదులు అందులో ఏం వేసిందో అర్థం కాలేదు. పోనీ పాలైనా పోసిందా? అని అనుమానం వచ్చిందతడికి.

భర్త మనసులోని ఊహలను చదివినట్టే అంది శాంతి "ఆశ్చర్య పోతున్నారు కదూ? అందులో పాలు కూడా పొయ్యలేదు నేను."

నిజంగా ఆశ్చర్యపోయాడు శ్రీనివాస్.

అప్పుడంది శాంతి "చిక్కటి గంజిలో ఓ పాల చుక్కా, చిటికెడు పంచదారా వేసి తీసుకొచ్చాను. మీ తెలివితేటలు పరీక్షిద్దామని. మీ మొహానికి ఆ మాత్రం తెలివితేటలు ఉంటే ఇంకేం?"

భర్త చేతిలోని గ్లాసు లాక్కొని, లోపలికి వెళ్ళి మరో గ్లాసుతో తిరిగొచ్చింది శాంతి.

ఆమె మళ్ళీ తెచ్చిన గ్లాసు వైపు అనుమానంగా చూశాడు శ్రీనివాస్. శాంతి అతడి వైపు చూసి నవ్వుతూ అంది – "ఈసారి భయపడకండి. ఇది నిజంగా పాయసమే! ఇంకెప్పుడూ అలా మూగిగా కూర్చోకండి. మీరు మౌనంగా ఉంటే నేనేమం చేస్తానో మీకు తెలియ జెప్పటందు కిది శాంపిల్ మాత్రమే."

భార్య హాస్యప్రయత్నానికి, తెలివి తేటలకు ఆమెను అభినందించకుండా ఉండలేక పోయాడు తన మనసులో. కానీ అతడిలో ఉన్న డిఫెక్ట్– మనసులోని భావం పైకి చెప్పుకోలేక పోవడం. ఇపుడు నిజంగా అతడికి భార్యనభినందించాలని ఉన్నా ఆ భావాన్ని వ్యక్తం చేయలేక పోయాడు. ఎంత ప్రయత్నించి కూడా అందుకే చిరునవ్వు నవ్వాడు, అదే నా అభినందన అన్నట్టుగా.

భార్యలా చకచకా మాట్లాడాలని, చక్కగా సంభాషించాలని అతడికి ఉంది మనసులో. కానీ క్రియారూపంలో పెట్టలేక పోతున్నాడతడు. భార్య డామినేషన్ వలన.

★ ★ ★ ★

"జీతం వచ్చి వారం రోజులేగా అయింది? మీకిచ్చిన వందా అప్పుడే ఖర్చు పెట్టేశారా? అప్పుడే నా దగ్గర చేయి చాపుతున్నారూ?" భర్త మొహంలోకి చూస్తూ అంది రాజేశ్వరి.

భార్య సూటి ప్రశ్నకు తడబడ్డాడు సుధాకర్. పెళ్ళైన కొత్తలో భర్త ఆదాయం, ఇంటి ఖర్చు వివరాలేమి పట్టించుకోక పోయినా, క్రమేణా తనలా పట్టించుకోక పోవడం వల్ల, నెలాఖర్లో ఇల్లు గడవడానికి పొరుగిళ్ళ వాళ్ళను నిత్యావసర వస్తువుల కోసం దేబిరించాల్సిన పరిస్థితి ఏర్పడడంతో, కర్తవ్యం గుర్తు తెచ్చుకొని భర్తతో ఒక ఒప్పందాన్ని చేసుకుంది రాజేశ్వరి.



# తిరగబడిన సిద్ధాంతం

భర్త జీతం రాగానే తన ఖర్చులకు వంద రూపాయలు మాత్రం ఉంచుకొని మిగిలింది భార్య చేతిలో పెడతాడు సూక్ష్మంగా చెప్పాలంటే ఇది ఆ ఒప్పందం.

వివరంగా చెప్పాలంటే తన కిచ్చిన వంద రూపాయల్లోనే సిగరెట్లూ, షికార్లూ, ఇటువంటివి సరిపెట్టుకోవాలి సుధాకర్. మిగిలిన డబ్బంతా రాజేశ్వరి అధీనంలో ఉంటుంది.

ఇల్లు నడపడం, మిగిలిన డబ్బు భవిష్యత్తు కోసం దాచడం, ఆమె పనులు. భర్తను ఈ మేరకు ఒప్పించడానికి చాలా కృషి చేసింది రాజేశ్వరి.

"అడ్డూ అదుపూ లేకుండా ఖర్చు చేస్తే, రేపు పిల్లల్ని చూసే దిక్కు ఉండదనీ, అంతగా ఖర్చు పెట్టడానికి అలవాటు పడిన మనిషి అసలు పెళ్ళే చేసుకోకుండా ఉండవలసిందనీ, పెళ్ళి చేసుకున్నాడు గనుక- ఆ తరువాత పిల్లలు పుట్టడం కూడా జరిగి పోయింది కాబట్టి, పెళ్ళానికీ, పిల్లలకూ ఏ లోటూ రాకుండా చూసుకోవడం మీ కనీస ధర్మం అని రోజూ నొప్పి పుట్టేలా ఉపన్యాసా లిచ్చి, భర్తను లొంగదీసి ఆ ఒప్పందానికి సుముఖుణ్ణి చేసింది.

సుధాకర్‌కూ వ్యసనా లేమీ లేవు సిగరెట్లు కాల్చడం తప్ప. త్రాగుడు అలవాటు లేదు. పేకాట్నం చేతకాదు. డబ్బు లిచ్చి సుఖం కొనుక్కోవలసిన అవసరం అతడి కింతవరకూ రాలేదు రాజేశ్వరి అతడి భార్య కావడం వలన.

కానీ అతడి చేతిలో డబ్బు మంచినీళ్ళలా ఖర్చవుతుందంటే అందుకు కారణం అతడి ఫ్రెండ్స్ సర్కిల్. వాళ్ళతో కలిసి ఊళ్ళు తిరుగుతాడు, సినిమాలు చూస్తాడు, హోటళ్ళ చుట్టూ తిరుగుతూ ఉంటాడు. అందువల్లే అతడి చేతిలో ఎంత డబ్బైనా నిలవడం లేదు.

ప్రతి నెలా అనుకుంటా డతడు – తన చేతి కొచ్చిన వంద రూపాయల్నూ నెలాఖరు వరకూ జాగ్రత్తగా వాడుకోవాలనీ. కానీ అది అనుకోవడంగానే మిగిలిపోతోం దతడికి. ఈ సారి అలాగే అయింది.

నిన్నటివరకూ జాగ్రత్తగా ఖర్చుపెట్టి సాయంత్రం ఇంటి కొచ్చేముందు స్నేహితులు బలవంతం చేస్తే హోటల్ కెళ్ళాడు. హోటల్ బిల్ ఎప్పుడూ అతడే ఇస్తూండడం వలన, బిల్ పే చేస్తానని ఏ స్నేహితుడూ ముందుకు రాలేదు.

ఆ తరువాత సినిమా అన్నారు. తన స్నేహితులంతా థియేటర్ ఆవరణలో చూడబోయె సినిమా తాలూకు స్టిల్స్ చూస్తోంటే, టికెట్స్ తీయడం అతడికి తప్పలేదు.

సినిమా అయ్యాక, "ఇప్పు డిళ్ళ కెళ్ళి పెళ్ళాలనేం ఇబ్బంది పెడతాంలే గురూ." అని అంతా మళ్ళీ ఓ హోటల్‌లోకి దూరారు.

అతడికి త్రాగడం అలవాటు లేకపోయినా, అతడి మిత్రుల్లో ఒకరిద్దరికి బయట మంచు కురుస్తున్నా చల్లని బీరు సేవించే అలవాటుండడంతో మిగిలిన ఆ కాస్త డబ్బూ అతడి చేతుల్లోంచి బీరు సీసాల్లోకీ, నాన్‌వెజిటేరియన్ డిష్‌ల్లోకి చేరుకొంది.

అందుకే మర్నాడడిగాడు రాజేశ్వరిని ఆ రోజు ఖర్చుల కోసం.

రాజేశ్వరి కతడి బలహీనత తెలుసు. భర్త తలచుకొంటే తనను లెక్క చెయ్యకుండా మొత్తం డబ్బు అతడే ఖర్చు పెట్టుకోవచ్చు. కానీ అతడలా చెయ్యకుండా, తన మాటకు విలువిచ్చి అతడి సంపాదనలోని డబ్బుకోసం తన నభ్యర్థించడం- ఆమెకు భర్త మీద గల అభిమానాన్ని రెట్టింపు చేస్తోంటుంది. ఆ సమయాల్లో ఓ ప్రక్క భర్తలో తనాశించిన పొదుపరితనం ఇంకా రాలేదనిబాధగా ఉన్నా. .

అందుకే అంది, "సరే మొత్తం డబ్బు మీకు ఒక్కసారే ఇచ్చే అలవాటుకు ఈ నాటితో స్వస్తి. ఇదివరకు మీ నెల ఖర్చులకు వంద రూపాయలు కదా ఇస్తున్నాను? ఈ రోజు నుంచి అది నూట ఇరవైకి పెంచుతున్నాను, అంటే రోజుకు నాలుగు రూపాయ లన్నమాట."

ఇంట్లోకి వెళ్ళి నాలుగు రూపాయలు తెచ్చి భర్త చేతిలో పెట్టి – "మళ్ళీ రేపు." అంది రాజేశ్వరి.

ఆమాత్రానికే సంతోషించి భార్యను కౌగలించుకో బోయాడు సుధాకర్.

* * * *

అర్ధ రాత్రి ఇంటికొచ్చిన మురళి, తలుపు తీసిన భార్యను చూసి జాలి పడ్డాడు. అతడలా జాలిపడడానికి కారణం అతడంతవరకూ వేరేచోట, పడక గదిలో భార్యతో తీర్చుకోవాల్సిన అవసరాన్ని తీర్చుకొని రావడమే.

అతడికోవైపు బాధగా ఉంటుంది తన చర్యల నేనాడూ నిరసించని భార్యను చూసి. మొదట్లో తెలియక పోయినా తరువాత్తరువాత తన చిల్లర వేషాలు భార్యకు తెలిసే ఉంటాయని అతడికి బాగా నమ్మకం. అయినా ఆ బలహీనత నుంచి బయటపడలేక పోతున్నాడు.

తను తిరుగుబోతని తెలిసినా చలించని భార్య అంటే అతడి కపరిమితమైన అనురాగం. భర్త మనసులో తన మీద ఉన్న అనురాగా న్నాధారం చేసుకొని అతడి చర్యల నాపే ప్రయత్నం రాధ ఏనాడూ చేయలేదు. ఆమె అలా ప్రయత్నించక పోవడమే రోజు రోజుకూ ఆమె పట్ల మురళికి అనురాగం అధికం కావడానికి కారణం కావచ్చు.

బయటి వ్యక్తులతో అనుభవం పొంది బయటకు వచ్చిన ప్రతిసారి అలా చేయకూడదని అనుకుంటూనే ఉంటాడు మురళి. ఆ హేంగోవర్ అలా రెండు మూడు రోజు లుంటుంది. తర్వాత మళ్ళీ మామూలే. అతడి జారతనం, ఆమె పాతివ్రత్యం చెక్కు చెదరకుండా అలాగే ఉన్నాయి ఇన్నాళ్ళనుంచీ.

మర్నాడుదయం భార్య ఇచ్చిన కాఫీ త్రాగుతూ ఆలోచనలో పడ్డాడు మురళి. తన అక్క అరుణ శాంతానికి ప్రతిరూపం అయితే ఆమె భర్త రామారావు విశ్వామిత్రుడి వారసుడు.

తన అన్న శ్రీనివాస్ మాటలు రాని బొమ్మయితే అతడి భార్య శాంతి వసపిట్ట. తన పిన్ని కూతురు రాజేశ్వరి గృహ పొదుపు విభాగానికి అధ్యక్షురాలైతే ఆమె భర్త సుధాకర్‌కు, మంచినీళ్ళకూ, డబ్బుకూ తేడా తెలియదు.

తను వ్యభిచారి అయితే తన భార్య రాధ పరమ సాధ్వీమణి. సృష్టి ఎంత చిత్రమైనది! "మారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్" అన్నది కరక్టేనా? సృష్టిలో విరుద్ధ స్వభావాలు గల వ్యక్తులు జంటలుగా కలప బడడమే ఆ నానుడి వెనుక ఉన్న సూత్రమా?

నిజంగా సృష్టి ఎంత గొప్పది? తమ ప్రమేయం లేకుండానే విభిన్న దృక్పథాలు గల ఇద్దరు వ్యక్తులు భార్యాభర్తలు కావడం వల్లనే వారి వైవాహిక జీవితం సమతూకంగా ఏ ఒడిదుడుకులూ లేకుండా సవ్యంగా సాగుతోందా?

ఆలోచిస్తున్న మురళి ఉలిక్కి పడ్డాడు. అతడలా ఉలిక్కి పడడానికి కారణం- అతడి కా సమయంలో రమణారావు గుర్తుకు రావడమే. ఆ వెనువెంటనే రమణారావు భార్య జ్యోతి మెదిలిందతడి మదిలో.

రమణారావు సన్నగా రివటలా ఉంటే అతడి భార్య జ్యోతి కండపుష్టిగా ఉంటుంది. రమణారావు మురళి కొలీగ్ కూడా. ఓసారి కొలీగ్స్ అందరూ మందుపార్టీ చేసుకొని ఆ అర్ధరాత్రి ఎవరికో మనసు పుట్టగా అప్పటికప్పుడు ఓ అమ్మాయిని రప్పించా రక్కడికి. అందరిలోకి ఏ అలవాటూ లేని అర్భకుడు రమణారావే. అతడి నాట పట్టించాలని, అతడు మొత్తుకుంటున్నా వినిపించుకోకుండా ఓ గదిలోకి తోశారు, ఆ అమ్మాయితో సహా.

ఓ పదిహేను నిమిషాల తర్వాత ఆ అమ్మాయి బయటి కొచ్చింది. అంతా ఆత్రుతగా ఆమె చుట్టూ మూగారు. ఆమె విసుగ్గా గదిలోకి చూపించింది. అంతా లోపలికి వెళ్ళి చూస్తే గదిలో ఓ మూలగా కళ్ళు మూసుకొని ముడిచి పెట్టుకొని పడుకున్న రమణారావు కనిపించాడు.

అతణ్ణి లేపబోతే కళ్ళు తెరవకుండానే- "ఊహుఁ! నాకు భయం, నేనలాంటి వాణ్ణి కాదు. ప్లీజ్! నన్ను వదిలేయండి, ప్లీజ్, ప్లీజ్...." అన్నాడు.

విషయం అర్థమై అంతా పగలబడి నవ్వేశారు. "వెధవా! ఆడదంటే అంత భయపడే వాడివి, ఇంట్లో పెళ్ళాన్నెలా ఏడుస్తున్నావ్‌రా?" అన్నాడు కూడా ఓ మిత్రుడు పచ్చిగా.

వాళ్ళ నవ్వులకు కళ్ళు తెరిచి- "హమ్మయ్య....

## ఆడపిల్ల - అగ్గిపుల్ల

ఈ దేశంలో
అగ్గిపుల్లలాటిదే
ఆడపిల్ల కూడా!
ఏ చిన్న తాకిడికైనా
వెలుగుతుంది
ఏ గాలి అలకైనా
ఆరిపోతుంది.

-కొంపెల్ల విశ్వం

మిరా! భయపడి చచ్చానురా, నా కొద్దంటున్నా వినిపించుకోకుండా దాన్ని గదిలో పెట్టి తలుపేశారు. చూడండ్రా నా చొక్కా చింపేసింది." అంటూ అమాయకంగా చిరిగిపోయిన చొక్కా చూపించాడు రమణారావు.

ఆ సంఘటన గుర్తొచ్చింది మురళికి. అవకాశం ఉన్నా వ్యభిచారం చేసే ధైర్యం లేని ఆ చవట ఆ రమణారావు. సో. తన సిద్ధాంతం ప్రకారం అతడి భార్య ఎటువంటిదై ఉండాలి హుషారుగా ఈల వేశాడు మురళి.

"ఛెళ్" మన్న చెంపను తడుముకొంటూ నిలబడ్డాడు మురళి, జ్యోతి ముందు.

జ్యోతి కళ్ళలో నిప్పులు కురిపిస్తూ అంది, "వెధవా, డబ్బిచ్చి రోజుకో దానితో కులుకుతున్నా నీ రోగం తగ్గలేదా? చివరకు సంసారుల్ని కూడా పాడు చేస్తేనే గానీ నీ కోరిక చావదా? నీ వేషాలకు అంతేముంది? అయినా నేను లొంగుతానని ఎలా అనుకున్నావ్?

నా భర్త మెత్తగా ఉదాశీనంగా ఉంటారు కదా అని, నీ రసికత్వానికి మురిసి పోతా ననుకున్నావా? మిరంతా ఓ రోజు ఆయన్ని బలవంతం చేసి ఓ సానిదాన్తో గదిలోకి పంపించిన విషయం నా కానాడే చెప్పారాయన!

అప్పటి నుంచి నీ మిద కన్నేసి ఉంచాను– అవకాశం వచ్చినపుడు ఓ దులుపు దులుపుదామని. నీ అంతట నువ్వే వచ్చావ్! ఆ రోజు ఆయన దాన్తో ఇదవ్వడానికి సిగ్గు పడ్డారు కనుక, ఇంట్లో కూడా అలాగే ఉంటారని, ఆ లోటు పూరిద్దామని వచ్చినట్టున్నావు పాపం!

నీ పెళ్ళాం మంచిది, నోరు లేనిది కనుక నీ బుద్ధికి సరిపెట్టుకొంటోంది. నీ పెళ్ళాం స్థానంలో నేనుంటే మర్నాడే నీకు బుద్ధొచ్చేలా చేసే దాన్ని. వెళ్ళు, ఇంకెప్పుడూ ఇటువంటి ప్రయత్నం చెయ్యకు. అమాయకురాలైన నీ భార్య మొహం చూసి నిన్నల్లరి చేయకుండా వదిలేస్తున్నాను."

అయిదు వేళ్ళూ తేలిన చెంపను ఓ చేతో దాచుకుంటూ ఇంట్లోంచి బయట పడ్డాడు మురళి. తన ఎనాలిసిస్ ఇంత ఘోరంగా దెబ్బ తింటుందనుకోలే దతడు. తన విశ్లేషణ ప్రకారం– మొగుడికీ, పెళ్ళానికీ ప్రవర్తనలో పూర్తి వ్యత్యాస ముండాలి.

తన సిద్ధాంతం ప్రకారం రమణారావ్ ఇంత చవట అయినపుడు జ్యోతి పతివ్రతగా ఉండడానికెంత మాత్రమూ వీలు లేదు. రమణారావు బయట ఆడవాళ్ళ ముందు పిల్లి అయినా ఇంట్లో పులేమో?

అలాగే తన అక్క అరుణలోని శాంతం. రామారావుతో పెళ్ళయ్యాకనే ఆమెలో చూస్తున్నాడు తను. చిన్నపుడు తనతో దెబ్బలాడడం, తామిద్దరూ ఒకరి నొకరు కొట్టుకోవడం గుర్తొచ్చింది.

అప్పట్లో అరుణ అందరి లాంటిదే. కానీ భర్త దూర్వాసుడవడంతో అతడి కనుగుణంగా శాంత గుణాన్నలవరచు కొంది. శ్రీనివాస్ కూడా పెళ్ళికి ముందు ఇంత మూగిగా ఉండేవాడు కాదు. కానీ అతడు మాట్లాడవలసిన మాటలు కూడా భార్యే మాట్లాడడంతో అతడి కవకాశం లేక మౌనంగా ఉంటున్నాడు.

దెన్.... రాజేశ్వరి, చిన్నపుడు బట్టలకోసం, సినిమాలు చూడ్డానికి తన పిన్ని దగ్గర, బాబాయి దగ్గర ఎంత గొడవ చేసేది? సుధాకర్‌లోని దుబారాతనం ఆమెకు పొదుపు నేర్పింది.


తను వ్యభిచారి అయినా తన భార్య పాతివ్రత్యానికేం భంగం కలుగలేదే? ఏమో ఆమె మనసులో ఏముందో ఎవరికి తెలుసు? తన ప్రవర్తన ఇంతవరకూ సహించగలిగే హద్దుల్లోనే ఉందేమో? ఆ హద్దులు తను దాటానని ఆమె అనుకొంటే, అప్పుడు... ఇక ఊహించలేక పోయాడు మురళి.

తన జనరలైజేషన్ తప్పు. ఎదుటి వారిలోని లోపాలను తమ ప్రవర్తన ద్వారా కాంపెన్‌సేట్ చేసే విషయంలో భాగంగానే తన అక్క అరుణ, అన్న శ్రీనివాస్, పిన్ని కూతురు రాజేశ్వరి తమ తమ సహజగుణాలను కొంతవరకూ పక్కకు నెట్టారు అంతే!

. అవసరం వారినలా ప్రవర్తించేలా చేసింది. ఇది అర్థం కావడానికి తను చెల్లించిన మూల్యం ఓ చెంప దెబ్బ. అయినా తన కర్థంగాని విషయం ఇంకా ఏదో ఉన్నట్టే ఉంది.

"మరో చెంప దెబ్బ తింటేనేగానీ ఆ అనుమానం పూర్తిగా తీరదేమో?" అనుకున్నాడు మురళి. □

# ఇ·వేమన·పద్యాలు




చక్కెర గలుపుక తిన్నన్
ముక్కున తవుడైన లెస్స మోహముగలచో
వక్కరపు బానిసైనను
మక్కువతో దివ్యభామ మణియగు వేమా.